## ఘనంగా ఘంటసాల జయంతి వేడుక

భట్టిప్రోలు, పెన్ పవర్ ఫిబ్రవరి,11:
స్వామి వివేకానంద విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో గానగంధర్వుడు మధుర గాయకుడు స్వాతంత్ర సమరయోధుడు ఆంధ్రప్రదేశ్ అవతరణ కారకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని భట్టిప్రోలు మినీ ట్యాంక్ బండ్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి వారిని స్మరించుకొని కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, చందులూరి రామ కోటేశ్వరరావు, రావూరి సత్యనారాయణమూర్తి ఘంటసాల జీవిత విశేషాలు వివరిస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిదంబరం, శివప్రసాద్, జిలాని,రాజా,నందం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



## చందోలు గ్రామం లో ఆకాస్మికంగా విద్యుత్ తనిఖీ:



పిట్లలవానిపాలెం పెన్ పవర్ న్యూస్:
బాపట్ల విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ ఎం భాస్కర్ రావు గారు పిట్లవాని మండలం చందోలు గ్రామంలో ఆకస్మికంగా విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్తును చౌర్యం చేస్తున్న ఒక సర్వీసును గుర్తించి రూ. 40000 అపరాధ రుసుము విధించారు. అలాగే అదనపు లోడు వాడుతున్న ఐదు సర్వీస్లను గుర్తించి రూ. 3.3 లక్షలుఅపరాధ రుసుము విధించారు.

## శ్రీ చెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు



పిట్టల వానిపాలెం పెన్ పవర్ న్యూస్:
బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వైష్ణవాలయమైన శ్రీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థానములో ఈనెల 27వ తేదీ ఏకాదశి నుండి జరిగే శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ యెండూరి సాయి గుప్తా తెలియపరిచారు ఈ స్వామివారి కళ్యాణోత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు ఆలయానికి విచ్చేయుదురు భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు నిర్వహిస్తున్నామని ఆలయంలో జరుగు వివిధ కార్యక్రమాల గురించి ట్రస్ట్ బోర్డ్ సభ్యులకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వివరించారు శ్రీ స్వామివారి దేవస్థానములో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు భక్తకోటి సహాయ సహకారాలు అందించాలని ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఒక ప్రకటనలో కోరారు ఆలయంలో దేవదాయ శాఖ సిజిఎఫ్ నిధులు వెచ్చించి ఆలయంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని దాతలు 5000 పైబడి విరాళములు ఇచ్చిన వారి పేర్లు శిలాఫలకం మీద ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ ఈ.ఓ జి నరసింహామూర్తి తెలియపరిచారు ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ట్రస్ట్ బోర్డ్ సభ్యులు అర్చక స్వాములు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని ఈవో తెలియపరిచారు

## ముస్లిం మైనారిటీల సంక్షేమమేధ్యేయం: మున్సిపల్ చైర్మన్ రఫాని.

### -కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నిధులు మంజూరు...

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 11 :
చిలకలూరిపేట: పట్టణంలోని ముస్లిం మైనారిటీల సామాజిక, సాంస్కృతిక అవసరాల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ రఫాని స్పష్టం చేశారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ముస్లిం నాయకులు, సభ్యులు, వార్డు స్థాయి ప్రజా ప్రతినిధులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధిపై చర్చ పట్టణంలోని మద్దినగర్-రహమత్ నగర్ ఆనుకుని ఉన్న ముస్లిం మైనారిటీ కమిటీ హాల్,సుభాన్ నగర్‌లోని కమ్యూనిటీ హాల్ అభివృద్ధిపై సమావేశంలో సుదీర్ఘ చర్చ నిర్వహించారు. ఈ హాళ్ల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపైనాయకుల సలహాలుస్వీకరించారు. ఎమ్మెల్యేచొరవతో నిధుల మంజూరు. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ, ముస్లిం సోదరుల చిరకాల కోరిక మేరకు కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక



చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మైనారిటీల పట్ల ఎమ్మెల్యేకు ఉన్న ప్రత్యేక గౌరవానికి ఇది నిదర్శనమని, ఈ నిధులతో హాళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంజిమన్ కమిటీ బాధ్యులు, వివిధ వార్డుల ముస్లిం మైనారిటీ కౌన్సిలర్లు,పార్టీ నాయకులు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## పేట పట్టణంలో ఆక్రమణలు

### -బోర్డులకే పరిమితమైన నిబంధనలు!

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఫిబ్రవరి 11 :
చిలకలూరిపేట : పట్టణంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ కష్టాలు తీర్చడానికి అధికారులు చేపట్టిన చర్యలు “మూడు రోజుల ముచ్చట“గా మారుతున్నాయి. నర్సరావుపేట సెంటర్ నుండి రిజిస్టర్ ఆఫీస్ వరకు రోడ్డు విస్తరణ, ఆక్రమణల నివారణ కోసం ఏర్పాటు చేసిన బోర్డులు నేడు కేవలం అలంకారప్రాయంగా మిగిలాయి.

**అట్టహాసంగా మార్కింగ్.. ఆపై మౌనం**

కొద్ది రోజుల క్రితం టౌన్ ప్లానింగ్ అధికారులు నర్సరావుపేట సెంటర్ నుంచి రిజిస్టర్ ఆఫీస్ వరకు రహదారికి ఇరువైపులా ఆక్రమణలు జరగకుండా స్పష్టమైన మార్కింగ్ ఇచ్చారు. ప్రజలకు అవగాహన కల్పించేలా, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఈ చర్యల వల్ల మొదటి పది రోజులు రహదారి ఎంతో విశాలంగా, వాహనాల రాకపోకలకు అనువుగా కనిపించింది.

అద్దె దందా: ఆక్రమణలే ఆదాయ మార్గం
నిబంధనలు అమలులోకి వచ్చిన కొద్ది రోజులకే పరిస్థితి మళ్ళీ మొదటికి చేరింది. షాపుల యజమానులు తమ షాపుల ముందున్న ఖాళీ స్థలాన్ని, ప్రభుత్వం కేటాయించిన మార్కింగ్ లోపల ఉన్న భాగాన్ని చిరు వ్యాపారులకు అద్దెకు ఇస్తున్నారు. రోజుకు రూ. 100 నుండి రూ. 200 వరకు వసూలు చేస్తూ రోడ్డును ఆక్రమిస్తున్నారు.








**ట్రాఫిక్ అంతరాయం - పార్కింగ్ కష్టాలు**

బోర్డుల కంటే ముందుకు వచ్చి దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల అసలు సమస్య మొదలవుతోంది. షాపులకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తోంది.

**టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం**

వేల రూపాయలు ఖర్చు చేసి బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు, వాటిని పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.
“బోర్డులు పెట్టి చేతులు దులుపుకుంటే సరిపోదు, నిరంతరం నిఘా ఉంచి ఆక్రమణదారులపై జరిమానాలు విధిస్తేనే మార్పు వస్తుంది.“
పట్టణంలోని ఈ దారుణ పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి, ఆక్రమణలను తొలగించి, సామాన్య ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు




## కోటప్పకొండ గిరి ప్రదక్షిణ రహదారికి రూ.38.60 కోట్లు మంజూరు

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట పెన్ పవర్ ప్రతినిధి ఫిబ్రవరి 11: కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి భక్తుల దశాబ్దాల కల నెరవేరబోతోంది. కోటప్పకొండ గిరి ప్రదక్షిణ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.38.60 కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ, కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ రహదారికి ప్రభుత్వం రూ.38.60 కోట్లు మంజూరు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసిందని అయన తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ నిధులు విడుదలయ్యాయన్నారు.
ఇటీవల నిర్వహించిన పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు గిరి ప్రదక్షిణ రహదారి అవసరాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. భక్తుల సౌకర్యం, కోటప్పకొండకు పెరుగుతున్న రద్దీ, భద్రతా పరమైన అంశాలను ఆయనకు వివరించి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దీనిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలకు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ రహదారి నిర్మాణంతో కోటప్పకొండకు వచ్చే లక్షలాది మంది భక్తులకు గిరి ప్రదక్షిణ చేయడం సులభతరం కానుందన్నారు. ప్రత్యేకంగా మహాశివరాత్రి వంటి ఉత్సవాల సమయంలో భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు, భద్రత కల్పించేందుకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే పర్యాటకాభివృద్ధికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఇది ఊతమివ్వనుంది.
నిధులు మంజూరు చేసిన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. గిరి ప్రదక్షిణ రహదారి పనులు త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అయన పేర్కొన్నారు. నిధుల మంజూరు పట్ల భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు



